ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 18.0

ANDHRAJYOTHY

5





సోమశిల, సిద్దేశ్వరం వంతెన నిర్మించనున్న ప్రదేశం



గద్వాల మండలం కొండపల్లిలో భోగి మంటలు వేసుకొన్న గ్రామస్థులు

సంబురంగా భోగి



అచ్చంపేట పట్టణంలో భోగి మంట వేసిన కాలనీ మహిళలు

సంక్రాంతి సంబురాల్లో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భోగి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. దూర ప్రాంతాలకు వెళ్లిన కుటుంబాలు సొంత గ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో పండుగ సందడి కనిపిస్తోంది.

నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోని పట్టణ, గ్రామ ప్రధాన కూడళ్లల్లో తెల్లవారుజామున భోగి మంటలు వేసి సంబురాలు చేసుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. నువ్వుల రొట్టెలు, కలగూరలు చేసుకొని ఇంటిల్లిపాది భోజనాలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలతో భక్తుల సందడి కన్పించింది. చిన్నారులు గాలి పటాలు ఎగురవేస్తూ సంతోషంగా గడిపారు. గ్రామీణ యువకులు క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

- గద్వాల/కందనూలు/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా, (ఆంధ్రజ్యోతి)



నాగర్‌కర్నూల్ భోగి మంట వేస్తున్న కాలనీవాసులు



ఖిల్లాఘణపురంలో ముగ్గులకు రంగులు వేస్తున్న చిన్నారులు



గద్వాల పట్టణం వడ్లవీధిలో భోగి మంట వేస్తున్న కాలనీవాసులు



వనపర్తి పట్టణంలోని జంగిడిపురం కాలనీలో భోగి మంట వేసుకున్న కాలనీవాసులు



వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో భోగి మంట వేసుకున్న వందేమాతరం వాకింగ్ సభ్యులు

సెమీస్‌కు తెలంగాణ

- రాజస్థాన్, యూపీ, ఏపీ కూడా..
- రసవత్తరంగా హ్యాండ్‌బాల్ టోర్నీ ● నేడు ఫైనల్



తలపడుతున్న తెలంగాణ, పంజాబ్ బాలికల జట్లు

6

అన్నదమ్ముల ఆత్మీయ కలయిక

- నారాయణ్ వంశానికి చెందిన 43 మంది
- సంక్రాంతి పండుగ కోసం సొంత ఊరు సిర్సనగండ్లకు రాక

7

కోరిన కోర్కెలు తీర్చే రామలింగేశ్వరుడు

- కోడేరు మండలంలో ఎత్తం గట్టుపై వెలసిన స్వామి
- నేటి నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు



ఎత్తం గట్టుపై వెలసిన రామలింగేశ్వర స్వామి

7

కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తి

- రూ. 1082 కోట్లతో కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి
- ఈ నెల 10న ముగిసిన టెండర్ల ఆన్‌లైన్ ప్రక్రియ
- మారనున్న జిల్లా రూపురేఖలు
- రెండు లేన్ల రహదారికి రూ.900 కోట్ల కేటాయింపు

6

నా ప్రాణానికి రక్షణ కల్పించాలి

- అయిజ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి
- డీఎస్పీ మొగులయ్యకు ఫిర్యాదు చేసిన బాధితుడు

7

హామీలన్నీ నెరవేరుస్తున్నాం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనపర్తి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి రైతు భరోసా కూడా అమలు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేశ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

తాడూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు పట్టణంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర ఎద్దుల బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆంధ్రా, ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి 14 జతల ఎద్దులు పాల్గొన్నాయి. తాడూరు మండల కేంద్రానికి చెందిన సంద మల్లయ్య ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఎద్దుల యజమానికి రూ. 80వేలు బహుమతిగా అందించారు. యాది రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అఖిలేష్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలువగా రూ.70వేల నగదు యజమానికి అందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లాకు చెందిన షబ్బీర్ ఎద్దులు తృతీయ స్థానంలో నిలువగా రూ. 60 వేలు అందజేశారు.



తాడూరులో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

మొత్తంగా ఏడుజతల వృషభాల యజమానులకు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు సంద మల్లయ్య, కోటీశ్వర్‌లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవాలు



గద్వాల అహోబిల మఠంలో భక్తుల సమక్షంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

6

ఆర్డీఎస్‌కు ఇండెంట్ పెట్టండి

- తెలంగాణ రైతుల పంటలు ఎండుతున్నాయి
- ఏపీ ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఏపీ ఈఎన్‌సీతో ఫోన్లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, సంపత్‌కుమార్

అయిజటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీఎస్ ద్వారా సాగునీరు అందక తెలంగాణ రైతులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఏపీ ఈఎన్‌సీతో సోమవారం ఫోన్లో మాట్లాడారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఉమ్మడి ఇండెంటే పరిష్కారం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మంత్రి జూపల్లి స్పందించారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ చొరవతో హైదరాబాదునుంచి ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావుతో ఫోన్లో మాట్లాడుతూ తెలంగాణ రైతుల కోసం ఆర్డీఎస్ వాటాగా యాసంగి పంటకు ఉన్న ఐదు టీఎంసీల నీటిలో ఇప్పటికే రెండు టీఎంసీలు మా అధికారులు ఇండెంట్ పెట్టారని, ఏపీ వాటా నుంచి మరో రెండు టీఎంసీలు ఇండెంట్ పెట్టాలని సూచించారు. ఇందుకు ఏపీ ఈఎన్‌సీ సానుకూలంగా స్పందించినట్లు సంపత్‌కుమార్ తెలిపారు. ఇదే సందర్భంలో ఏపీ ఈఎన్‌సీ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ వీలైనంత త్వరగా ఇండెంట్ పెట్టేందుకు చర్యలు తీసుకొని పంటలకు సాగునీరు వచ్చేలా కృషి చేయాలని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌ను మంత్రి ఆదేశించినట్లు సంపత్‌కుమార్ తెలిపారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా ఇదే విషయంపై ఈఎన్‌సీతో మాట్లాడినట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు

- ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఉపాధి అవకాశాలు
- నారాయణపేట జిల్లాలో 150 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- ఇప్పటికే 47 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు
- ఒక్కో ప్లాంట్ వ్యయం రూ.3 కోట్లు..


సోలార్ ప్లాంట్ నమూనా

నారాయణపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఉపాధి కల్పించేందుకు మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 150 ఎకరాలకు తగ్గకుండా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ భూములను అన్వేషిస్తోంది. ఇప్పటి వరకు 47 ఎకరాల భూమిని గుర్తించారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లిలో గల 57.28 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అందులో సోలార్ ప్లాంట్ కోసం పది ఎకరాలను కేటాయించేందుకు నివేదికలు తయారు చేయాలని ఆర్డీవో రాంచందర్‌ను ఆదేశించారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా మండలాల్లో అధికారులు ప్రభుత్వ భూములను గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు 47 ఎకరాల ప్రభుత్వ భూమి ఎంపిక చేశారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రెండు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో స్థలాలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఈనెల 20 లోపు భూమిని ఎంపిక చేసి, నివేదికలు పంపనున్నారు.

90 శాతం బ్యాంకు రుణం

ఒక మెగా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు నాలుగు ఎకరాల స్థలం అవసరం ఉంటుంది. రూ.మూడు కోట్లతో ఒక్కో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో పది శాతం మహిళా సంఘాలు చెల్లిస్తే.. 90 శాతం బ్యాంకు రుణం ఇప్పించనున్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల నిర్వహణపై మహిళా సంఘాలకు త్వరలో శిక్షణ ఇప్పించనున్నారు. ఈ ప్లాంట్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్‌ను రూ.3.15 ప్రకారం డిస్కమ్(విద్యుత్ ఉత్పత్తి సంస్థల)లతో ప్రభుత్వమే కొనుగోలు చేయిస్తుంది. దాంతో మహిళా సంఘాలకు ఏడాదికి దాదాపుగా రూ.30 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.

40 సంఘాలకు అప్పగింత

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 11 మండల మహిళా సమాఖ్యలు, 353 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. అందులో పొదుపు సంఘాలు 8,196 ఉండగా.. 93,892 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 34 నుంచి 40 గ్రామ సమాఖ్య సంఘాలు అప్పగించనున్నారు. గామ సమాఖ్యల పని తీరును పరిగణలోకి తీసుకొని ఎంపిక చేయ్యనున్నారు.

హ్యాండ్‌బాల్ టోర్నీలో..
సెమీస్‌కు చేరిన తెలంగాణ


తలపడుతున్న తెలంగాణ, పంజాబ్ బాలికల జట్లు

- రాజస్థాన్, యూపీ, ఏపీ కూడా..
- హోరాహోరీగా పోటీలు
- నేడు ఫైనల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. నువ్వా నేనా అన్నట్లుగా క్రీడాకారులు తలపడుతున్నారు. సోమవారం బాలుర విభాగంలో జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు హర్యానాపై 16-09 స్కోర్ తేడాతో గెలిచి సెమీస్‌కు చేరగా, బాలికల విభాగంలో తెలంగాణ జట్టు కేరళపై 18-10 తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. బాలుర విభాగంలో తెలంగాణ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, బాలికల విభాగంలో తెలంగాణ, హర్యానా, రాజస్థాన్ సెమీస్‌కు చేరాయి.

బాలుర విభాగంలో..

బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు గుజరాత్‌పై 18-13, హర్యానా జట్టు చత్తీస్‌గఢ్‌పై 18-14, రాజస్థాన్ జట్టు కర్ణాటకపై 26-07, వెస్ట్‌బెంగాల్ జట్టు చత్తీస్‌గఢ్‌పై 18-14, ఉత్తరప్రదేశ్ జట్టు బీహార్‌పై 19-14, కేరళ జట్టు ఎన్‌వీఎస్‌పై 24-21, పంజాబ్ జట్టు డీఏవీపై 16-08, ఆంధ్రప్రదేశ్ జట్టు ఢిల్లీపై 17-10తో గెలుపొందాయి. బాలికల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు పంజాబ్‌పై 11-06, హర్యానా జట్టు మహారాష్ట్రపై 20-12, ఉత్తరప్రదేశ్ జట్టు వెస్ట్‌బెంగాల్‌పై 14-05, కేరళ జట్టు కర్ణాటకపై 12-09, రాజస్థాన్ జట్టు బీహార్‌పై 06-03, తమిళనాడు జట్టు మధ్యప్రదేశ్‌పై 18-07, గుజరాత్ జట్టు చత్తీస్‌ఘడ్ పై 16-06, హిమాచల్ జట్టు ఒడిశాపై 13-07తో గెలుపొందాయి.


భూత్పూర్ మండలం కొత్తూర్‌లో కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తూ


గుడిమల్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పండగకురండి కలుద్దాం!

మహబూబ్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): 'మామా.. తమ్మీ పండగకు ఊరొస్తున్నారా?. అందరూ రండి పండగకు కలుద్దాం. ఊళ్లో కొత్తగా గుడి కట్టాం. పూజలు చేద్దాం'. అంటూ ఒకరు.. 'ఊర్లో క్రీడా పోటీలు, జాతరలు నిర్వహిస్తున్నాం. మనోళ్లంతా రావాలి. చార్జీలకు డబ్బులు పంపాలా?' అంటూ మరొకరు ఇలా సర్పంచ్‌గా పోటీచేసే ఆశావహులు పట్టణాలు, నగరాల్లో ఉన్న వారికి ఇప్పటికే ఫోన్లు చేశారు. తద్వారా సర్పంచ్‌గా పోటీ చేసే తమకే మద్దతు తెలపాలంటూ ఇప్పటి నుంచే ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న సంక్షేమ పథకాలు అమలు చేసి, ఫిబ్రవరిలో సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని ప్రయత్నాలు చేస్తోంది. దాంతో గ్రామీణ ప్రాంతాలలో సర్పంచ్ ఎన్నికల వేడి పెరిగింది. పోటీ చేయాలనుకునే వారు ఇప్పటికే ప్రజలను పలుకరిస్తూ, వారి మంచి చెడ్డలు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో వచ్చిన సంక్రాంతి పండగ వారికి ప్రజలను కలిసేందుకు మంచి వేదికగా మారింది.

విందు ఏర్పాటు

నవాబ్‌పేట మండల కేంద్రంలో ట్రస్ట్ పేరిట సర్పంచ్‌కు పోటీ చేయాలనుకుంటున్న ఓ అభ్యర్థి సోమవారం ఇంటికో కోడి, మహిళలకు చీర, పురుషులకు లుంగీ, కిరాణ సరుకులు పండగకు పంపిణీ చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే చీరలు, లుంగీలు పంపిణీ చేయగా, సోమవారం నిత్యావసరుకులు అందించారు. ఆదివారం ఇంటికో కోడి పంపిణీ చేయనున్నారని సమాచారం. మరికొన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఆ ఖర్చంతా పోటీలో ఉన్న అభ్యర్థులే భరిస్తున్నారు. భూత్పూర్ మండలం కొత్తపేట గ్రామంలో ఓ నాయకుడు కబడ్డీ పోటీలను నిర్వహించి, యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండగా, కర్వెన గ్రామంలో మరో నాయకుడు హైదరాబాద్‌లో ఉన్న వలస ఓటర్లపై దృష్టి సారించారు. పండగకు రావాలంటూ వారికి ఆహ్వానం పలికినట్లు తెలుస్తోంది. పండగ తరువాత అందరికీ విందు ఏర్పాటు చేశామని తప్పక రావాలని మరీమరీ కోరుతున్నట్లు సమాచారం. ఇదే మండలం పోతులమడుగులో ఓ అభ్యర్థి కోలాటం పోటీలకు స్పాన్సర్ చేశారు. కప్పెటులో మరో నాయకుడు వలస ఓటర్లకు ఫోన్‌చేసి గ్రామంలో కొత్తగా ఆలయం కట్టామని, అందరం కలిసి పండగ రోజు పూజలో పాల్గొందామని పిలిచినట్లు ప్రచారం సాగుతోంది. మూసాపేట మండలం వేముల గ్రామంలోనూ ఒక ఆశావహుడు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. నవాబ్‌పేట మండలం కొండాపూర్, కారుకొండ గ్రామాల్లో పోటీదారులు తమ అనుచరులతో క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. హన్వాడ మండలంలో ఓ నాయకుడు యువతను టూర్లకు పంపుతుండగా, అదే గ్రామానికి చెందిన మరో నాయకుడు విందులు ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా మండలాల్లోని గ్రామాలలో యువత, పండగకు వచ్చిన జనాలకు విందులు ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

పలకరింపులు.. మర్యాదలు

సర్పంచ్ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఆశావహులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు కొద్దిరోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వరుసలు పెట్టి పలకరిస్తూ వారి మంచి చెడ్డలపై ఆరా తీస్తున్నారు. హైదరాబాద్, జిల్లా కేంద్రాల్లో స్థిరపడ్డవాళ్లు ఊళ్లకు రావడంతో వారిని పలకరించే పనిలో నిమగ్నమయ్యారు. వాళ్లు రాగానే ఇంటికి వెళ్లి పలుకరిస్తున్నారు. కరెంట్, నీటి సమస్యలుంటే వాటిని తీర్చి, వారి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పరోక్షంగా తాను ఎన్నికల్లో సర్పంచ్‌కు పోటీ చేస్తున్నానని, మీ ఫోన్‌నెంబర్‌లు ఇవ్వాలని తీసుకుంటున్నారు. తిరిగి వెళ్ళేటపుడు చార్జీలకు డబ్బులు ఇస్తామని కొందరు చెబుతుండగా, మరికొందరు వారికి కావలసిన ఉప్పు, పప్పు, బియ్యం ఇస్తూ చేదోడుగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు.

రిజర్వేషన్‌లపై లోలోన ఆందోళన

ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారతాయని ప్రభుత్వం స్పష్టం చేయడంతో రిజర్వేషన్‌లో తమ గ్రామం ఎవరికి వస్తుందోనన్న భయం ఆశావహుల లోలోన వెంటాడుతోంది. ఓటర్ల మద్దతు కూడగడుతూనే రిజర్వేషన్‌లు తమకు అనుకూలంగా రావాలంటూ కోరుకుంటున్నారు. మన ఊరుకు ఈసారి ఎవరికి రిజర్వేషన్ అయింది?, ఎవరెవరు పోటీ చేస్తున్నారన్న చర్చనే గ్రామాల్లో జోరుగా సాగుతోంది. రిజర్వేషన్ల కోసం నాయకులు కొంత ఆలోచనలో పడ్డారు.

విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి

- డీసీఎం డోర్ విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదం
- హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో ఘటన

రాజేంద్రనగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి చెందిన సంఘటన హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక కేఎస్ ఆర్టీసీ కాలనీకి చెందిన మీర్జా అసద్ బేగ్ (54), జడ్చర్లకు చెందిన ఖాజాపాష డీసీఎంలో కడప నుంచి అల్యూమినియం ముడి సరుకును తీసుకుని సోమవారం ఉదయం కాటేదాన్‌కు వచ్చారు. కాటేదాన్‌లోని సిటిజన్ కాంటా పక్కన గోదాములో అల్యూమినియం సగం ముడి సరుకును అన్‌లోడ్ చేశారు. మిగతా సగం సరుకును వేరే గోదాములో మధ్యాహ్నం రెండు గంటలకు అన్‌లోడ్ చేయాలని సదరు యజమాని చెప్పాడు. దాంతో డ్రైవర్ మీర్జా అసద్ బేగ్ డీసీఎంను పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అంచున ఆపడానికి వెళ్లాడు. మరో డ్రైవర్ ఖాజా పాషా కిందకు దిగి నిలిచి ఉన్నాడు. మీర్జా అసద్ బేగ్ డీసీఎంను ఆపి, దిగడానికి డోర్ తీయగా.. అది పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగెలకు తగిలింది. దాంతో విద్యుదాఘాతంతో మీర్జా అసద్ బేగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల ద్వారా తెలుసుకుని అసద్ బేగ్ బావ అబ్దుల్ నసీర్ అక్కడికి వచ్చాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మైలార్‌దేవుపల్లి డీఐ మక్సూద్ అలీ తెలిపారు.

సంక్రాంతి పండుగ
సంప్రదాయాలకు నిలువుటద్దం
- డీఐజీ రమేష్ రెడ్డి


ఎస్ఐని అభినందిస్తున్న డీఐజీ రమేష్ రెడ్డి

ఆత్మకూరు/ అమరచింత, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ గ్రామీణ పట్టణ ప్రాంతాల సంప్రదాయాలకు నిలువుటద్దం లాంటిదని డీఐజీ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా తన సొంత గ్రామమైన మస్తీపూర్‌లో సంక్రాంతి పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భోగి పండుగ సందర్భంగా ఇంటి ముంగిళ్లలో వేసిన ముగ్గులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏడాది కాలం పాటు కష్టపడి పండించిన పంటలు ఇంటికి చేరుకున్న తరువాత జరుపుకునేది సంక్రాంతి పండుగ అని గుర్తు చేశారు. పండుగ సందర్భంగా ఆడబిడ్డలను కొత్త అల్లుళ్లను ఇంటికి పిలిపించుకుని సరదాగా గడుపుకుని సంప్రదాయాలకు విలువ ఇవ్వాలని తెలిపారు. అనంతరం అమరచింత బ్యాంకు దోపిడీకి గురి కావడంతో దొంగలను తొందరగానే ఛేదించినందుకు గాను అమరచింత ఎస్ఐ సురేష్‌ను అభినందించారు. అలాగే అమరచింతలో శాంతిభద్రతల పరి రక్షణకు అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అమరచింత స్టేషన్ సిబ్బంది మస్తీపూర్ గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

హనుమాన్ నామస్మరణతో
మార్మోగిన ఖిల్లా


ఇరుముడులతో బయలుదేరుతున్న ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు

ఖిల్లాఘణపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం గట్టు వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని బెస్తగేరి ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణ, గ్రామంలోని ప్రధాన రహదారులు వీర హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. సోమవారం వీరాంజనేయస్వామి మాలధారణ, భక్తుల పడిపూజ ఆలయ ఆవరణలో కనుల పండువగా నిర్వహించారు. వీరాంజనేయ గురుస్వాములు శ్రీరాములు గురుస్వామి, అశోక్ గౌడ్ గురుస్వామి, వీఎస్‌గౌడ్ గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారణ భక్తుల బంధుమిత్రుల సమక్షంలో ఇరుముడి నిర్వహించారు. వీరాంజనేయ స్వామి మాలధారణ భక్తులు ఇరుముడులతో, కాషాయ జెండాల మధ్య ఉత్సవ మూర్తి పాదుకలు(ఉద్దాలు) అఖండ భజనలతో జైశ్రీరామ్ నినాదాల మధ్య ఖిల్లా గట్టు వీరాంజనేయ స్వామి సన్నిధానానికి ఊరేగింపుగా పాదయాత్రతో చేరారు. ఆలయం ఆవరణలో కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్ అన్నదానం నిర్వహించారు.

కృష్ణానదిపై వంతెన
నిర్మాణానికి టెండర్లు పూర్తి

నాగర్‌కర్నూల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తి చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో పనులు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 167కే జాతీయ రహదారి పనులు రూ.900 కోట్ల వ్యయంతో రెండు లైన్ల రహదారి పనులు వేగంగా జరుగుతుండగా సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చకచకా పావులు కదుపుతోంది. రూ.1082 కోట్ల వ్యయంతో సోమశిల సిద్దేశ్వరం మధ్యన కేబుల్, సస్పెన్షన్ బ్రిడ్జికి పిలిచిన ఆన్‌లైన్ టెండర్లు ఈ నెల 10న ముగిశాయి.

సోమశిల సిద్దేశ్వరం నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలకు దూరాభారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం సిద్దేశ్వరం నుంచి నంద్యాల వరకు బ్రిడ్జి నిర్మాణం తర్వాత చేపట్టబోయే రోడ్డు పనులకు 600 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ నేపథ్యంలో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు రెండు లైన్ల రహదారి నిర్మాణానికి రూ.900 కోట్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయి.

తిరుపతికి తగ్గనున్న 80 కిలో మీటర్ల దూరం..

167కే జాతీయ రహదారి నిర్మాణం సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మాణం పూర్తైతే హైదరాబాద్ నుంచి తిరుపతికి, రాయలసీమ జిల్లాలకు దాదాపు 80 కిలో మీటర్ల దూరభారం తగ్గనుంది. కృష్ణానదికి అవతల రాయలసీమ ఇక్కడ తెలంగాణ సరిహద్దుగా ఉన్న నేపథ్యంలో ఏటిని దాటడానికి అనేక కష్టాలు అనుభవించాల్సి వస్తోంది. చుట్టు కిలో మీటర్లు తిరిగి అవతలికి కృష్ణానదిని దాటి వెళ్లే క్రమంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మాణం జరిగితే ఆనందించే వారిలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలే అధికంగా ఉంటారు.

ప్రధాని మోదీ సహకారంతోనే..



కొల్లాపూర్ ప్రాంత వాసుల చిరకాల వాంఛ నెరవేర్చడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో తోడ్పడ్డారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ కూడా వెనకబడిన ప్రాంతం కొల్లాపూర్‌ను గుర్తించి సోమశిల సిద్దేశ్వరం వంతెన కల సాకారమైతేనే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు నెరవేరుతాయని వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. 167కే జాతీయ రహదారి సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మాణంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనతో పాటు అనేక వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. పర్యాటక రంగం కూడా విస్తృతంగా అభివృద్ధి చెందుతుంది.

- ఎల్లేని సుధాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కనుల పండువగా కల్యాణోత్సవాలు

- గద్వాల పట్టణంలో గోదాదేవి, రంగనాథస్వామికి..
- నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో లక్ష్మీనరసింహుడి కల్యాణం


నరసన్నగుట్టపై లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులు

గద్వాల టౌన్, జనవరి 13 : జోగుళాంబ గద్వాల పట్టణంలోని వైష్ణవ సంప్రదాయ ఆలయాలైన సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, అహోబిలమఠం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, రంగనాథస్వామి ఆలయాల్లో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. పెద్ద అగ్రహారంలోని అహోబిళమఠం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గత నెలలో ప్రారంభమైన ధనుర్మాస ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారుల ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. స్వామివారిని స్థానిక గుంటి చెన్నకేశవస్వామి ఆలయం వరకు పల్లకీలో ఊరేగించారు. అదేవిధంగా భీంనగర్‌లోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. పట్టణంలోని బుర్దపేట శ్రీరంగనాథస్వామి వారి ఆలయంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ రఘునాథ్, కార్యదర్శి సామవేదం వేణుగోపాలచారి, న్యాయ సలహాదారుడు సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

తిమ్మాజిపేట : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాలకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులను ద్దేశించి మాట్లాడుతూ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ ఆవరణలో కల్యాణ మంటపాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తా నని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి వచ్చే భక్తులపై లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడం విశేషం. అంతకు ముందు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దంపతులకు ఆలయ ధర్మకర్త చిలుక సురేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

బాధిత కుటుంబానికి
న్యాయం చేయాలి

- ప్రధాన రహదారిపై బంధువుల ఆందోళన
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేశారు. ప్రమాదానికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు లారీని అక్కడే ఉంచాలంటూ సిల్వర్ జూబ్లీ క్లబ్ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను బాధితులు కోరారు. రోడ్డు ప్రమాదంలో నాగరాజు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నాగరాజు మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, ఎన్నం భూపతిరెడ్డి, రాములు, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

కోడి పందేల ఆటలో
ఆరుగురిపై కేసులు

వనపర్తి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేల ఆటలో ఆరుగురిపై కేసులు నమోదైన సంఘటన వనపర్తి మండల పరిధిలోని ఎద్దులగేరి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎద్దులగేరి గ్రామ శివారులో కొందరు కోడి పందేల ఆట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు వనపర్తి రూరల్ ఎస్ఐ, సిబ్బందితో కలిసి ఎద్దుల గేరి గ్రామ శివారులో వ్యవసాయ పొలం వద్ద తనిఖీ చేశారు. అక్కడ ఆరుగురు కోడి పందేలు ఆట ఆడుతుండగా... వారిని పట్టుకుని, నాలుగు మోటార్ సైకిళ్లను, ఐదు సెల్‌ఫోన్లను, నాలుగు కోడి పుంజులను, రూ.7,350 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

స్పోర్ట్స్ బాక్స్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» జాతీయ జట్టుకు ఎంపిక కావాలి : డీఎస్పీ వెంకటేశ్వర్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్‌ఐ బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీని సోమవారం నాలుగో రోజు పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. జాతీయ స్థాయి టోర్నీలో ఆయా జట్ల క్రీడాకారులు ప్రతిభ చాటాలని, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. జాతీయ స్థాయి పోటీలకు మహబూబ్‌నగర్ అతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ మహ్మద్ ఎజాజుద్దీన్, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, టోర్నీ ఆర్గనైజర్ జియావుద్దీన్, నిర్వాహకులు రజనీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్, పీడీలు వేణుగోపాల్, నాగరాజు, రాఘవేందర్, ముకర్రం, స్వప్న, అరుణజ్యోతి, మేరీ పుష్ప పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు సాయినిఖిత ఎంపిక



సాయినిఖిత

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మాడ్రన్ స్కూల్ విద్యార్థిని బాస్కెట్ బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యింది. తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్‌ఐ బాస్కెట్‌బాల్ టోర్నీలో ఆమె పాల్గొననున్నది. ఈ సందర్భంగా ఆమెను ఎస్‌జీ ఎఫ్ అండర్-17 కార్యదర్శి శారదాబాయి, మాడ్రన్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు విలియం హర్షం వ్యక్తం చేశారు. టోర్నీలో రాణించి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి పోటీలకు మేఘవర్ష



మేఘవర్ష

మక్తల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా సంగంబండ గురుకుల పాఠశాల విద్యార్థి మేఘవర్ష జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో గత నెల 24 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల షూటింగ్‌బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టు తరపున ఆమె పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ సంద ర్భంగా సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, కోచ్ బి.గోపాలం మాట్లాడారు. ఒడిశా రాష్ట్రంలోని పూరీ క్షేత్రంలో ఈ నెల 17 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తర ఫున మేఘవర్ష పాల్గొననున్నదని తెలిపారు. పీఈటీ శ్రీలత, షూటింగ్ బాల్ అసోసియేషన్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జట్టు విజయానికి కృషి చేయాలని కోరారు.

ఓం నమశ్శివాయ

» మాలధారణతో శివదీక్షలు ప్రారంభం » రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

చిన్నచింతకుంట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఓం నమశ్శివాయ అంటూ పరమేశ్వరుడి నామస్మరణతో మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డెమాన్ మారు మోగింది. గ్రామంలోని శివాలయంలో లింగాన్ని స్వయంగా శ్రీరాముడే ప్రతిష్ఠించారని పురాణ కథనం. పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం ఈ ఆలయంలో 120 మంది భక్తులు శివదీక్ష స్వీకరించారు. అంతకుముందు ఆలయంలో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శివశక్తి స్వామి ఆధ్వర్యంలో మాలధారణ చేసి దీక్ష స్వీకరించారు. వీరు 41 రోజుల పాటు నియమ నిష్ఠలతో దీక్ష కొనసాగించనున్నారు. ఆ తర్వాత శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి చేరుకొని స్వామి దర్శనం అనంతరం దీక్షను విరమించనున్నారు.



ఆలయంలో జపం చేస్తున్న శివ మాలధారులు

కోరిన కోర్కెలు తీర్చే రామలింగేశ్వరుడు



సంగమేశ్వరాలయం ఉన్న ఎత్తం గట్టు

» కోడేరు మండలంలో ఎత్తం గట్టుపై వెలిసిన స్వామి

» నేటి నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు



బండరాళ్ల మీదుగా కొండపైకి వెళ్తున్న భక్తులు

కోడేరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే దైవంగా రామలింగేశ్వర స్వామి భక్తుల పూజలందుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలంలో, ఎత్తం గ్రామ శివారులో దాదాపు 14 వందల అడుగుల ఎత్తయిన గట్టుపై స్వామి ఆలయం ఉంది. కోడేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన వెలిసిన ఈ ఆలయంలో ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కర్ణాటకలోని రాయిచూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. స్వామి దర్శనం కోసం భక్తులు కాలినడకన గట్టు ఎక్కాల్సి ఉంటుంది. భక్తులు వ్యయ ప్రయాసలకు ఓర్చి గట్టుపైకి చేరుకొని రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చు కుంటారు.

వివాహం, సంతాన యోగం

రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటే వివాహం జరుగుతుందని, దంపతులకు సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే స్వామి వారిని ఎక్కువగా యువతీ యువకులు, దంపతులు దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు.

బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు అన్నదానం, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. ఎత్తం గ్రామం నుంచి గట్టుపైనున్న గుడి వరకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. గుడి పక్కన ఉత్తరం వైపు నాలుగు అడుగుల స్థలం మాత్రమే ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రతగా ఉన్నా పక్కనే ఉన్న లోయలోకి జారిపడే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

ప్రారంభమైన నరసింహస్వామి ఉత్సవాలు

» నేడు దర్శించుకోనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలం, సంగినేనిపల్లిలో లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ సమీపంలోని రాతి గుహలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మీ దేవాలయాలను శుద్ధి చేశారు. అనంతరం అర్చకుడు రాంబాబు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రకంటి వెంకటేశ్ తెలిపారు.



ఆలయంలో కొలువుదీరిన చెంచులక్ష్మి, నరసింహస్వామి

మల్లయ్య జాతర ప్రారంభం

» నేడు పసుపు, బండారు, గొలుసు ఉత్సవాలు

» మైలాపురానికి నారాయణపేట మీదుగా ప్రత్యేక బస్సులు

నారాయణపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా సరిహద్దులో కర్ణాటకలోని మైలాపూర్ గ్రామంలో మల్లయ్య స్వామి జాతర సోమవారం ప్రారంభమైంది. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో నారాయణపేట మీదుగా మైలాపూర్ స్వామి సన్నిధికి తరలివెళ్లారు. జాతరకు తరలివెళ్తున్న భక్తులతో నారాయణపేట బస్టాండ్ సందడిగా మారింది. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మహాపూజ, రుద్రాభిషేకం చేశారు. జాతరలో ప్రధాన ఘట్టమైన గంగాస్నానం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గుట్టకు సమీపంలోని చెరువుకు మల్లయ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొచ్చి గంగాస్నానం చేయించి ఆలయానికి చేరుస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు గొలుసు, 1.30 గంటలకు పల్లకీసేవ ఉన్నాయి. సాయంత్రం ఆరు గంటలకు ధూప, దీప, నైవేద్యాలను సమర్పిస్తున్నారు. రాత్రి 10.30 గంటలకు మల్లయ్య స్వామికి గంగ మాళమ్మల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. గతంలో స్వామి, అమ్మవార్లకు గొర్రెపిల్లలను సమర్పించే ఆనవాయితీ ఉండేది. ఈ ఆచారాన్ని కర్ణాటక ప్రభుత్వం నిషేదించింది. భక్తులు తీసుకొచ్చే గొర్రె పిల్లలను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. దాదాపు పక్షం రోజుల పాటు కొనసాగే ఈ జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు.



ఆలయంలో కొలువు దీరిన మల్లయ్య స్వామి

నల్లమల పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

» అక్కమహాదేవి గుహల సందర్శనకు సఫారీ ప్రారంభం



సఫారీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో పర్యాటక రంగానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట రేంజ్ పరిధిలోని అక్కమహాదేవి గుహలకు ట్రెక్కింగ్, సఫారీ వాహనాలను సోమవారం డీఎఫ్‌వో రోహిత్ గోపిడితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కమహాదేవి గుహల సందర్శనకు వచ్చేవారు ఆన్‌లైన్లో రూ. 6500 నుంచి ఎనిమిది వేల వరకు వరకు డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫ్యామిలీ ప్యాక్‌లో భాగంగా తొలి రోజు కృష్ణా నది ఒడ్డున ఉన్న ఆక్టోపస్ వ్యూ పాయింట్, వజ్రాలమడుగు సందర్శన అనంతరం దోమలపెంట ఫారెస్టు కాటేజీలో బస ఉంటాయని తెలిపారు. రెండవ రోజు అక్కమహాదేవి గుహల వద్దకు సఫారీ వాహనంలో వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అక్కడ ట్రెక్కింగ్ అనంతరం అక్కమహాదేవిని దర్శించుకుంటారని చెప్పారు. అక్కడి నుంచి దోమలపెంటకు చేరుకుం టారని తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలో మరో 18 ప్రాంతాలను పర్యా టకంగా అభివృద్ధి చేసేందుకు గుర్తించామని, అందుకు రూ. 25 కోట్లు విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో అమ్రాబాద్ ఎఫ్‌డీవో రామ్మూర్తి, ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్, అటవీశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



పండుగ సందర్భంగా కలుసుకున్న నారాయణ్ వంశానికి చెందిన అన్నదమ్ములు

అన్నదమ్ముల ఆత్మీయ కలయిక

» నారాయణ్ వంశానికి చెందిన 43 మంది » సంక్రాంతి పండుగ కోసం సొంత ఊరు సిర్సనగండ్లకు రాక

చారకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒకే వంశానికి చెందిన అన్నదమ్ములు 43 మంది సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊరికి చేరుకున్నారు. అందరూ కలిసి వేడుకలు చేసుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, చారకొండ మండలం, సిర్సనగండ్ల గ్రామానికి చెందిన నారాయణ్ వంశానికి చెందిన వీరు సోమవారం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. గ్రామానికి చెందిన నారాయణ్ వంశానికి చెందిన వెంకటరెడ్డి వారసుల కొడుకులు, మనుమలు, మునిమలైన వీరందరూ వృత్తి, ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరికి వీలైతే వారు వారు వచ్చి వెళ్లేవారు. కానీ ఈ సారి అందరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అవసరమైన ఏర్పాట్లు చేసుకొని సొంత ఊరికి చేరుకున్నారు. తామంతా రక్త సంబంధీకులమైనా ఫోన్లలో మాట్లాడుకోవడమే కానీ, ఒకేసారి కలుసుకోవడం ఇదే మొదటి సారని వారు తెలిపారు. అందరం కలిసి పండుగ చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇకపై ప్రతీ సంవత్సరం సంక్రాంతికి స్వగ్రామానికి వస్తామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

వనపర్తి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. వనపర్తి జిల్లా, మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటమ్మ (45) ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. బుధవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రైతులు గుండం చెరువులో ఆమె మృతదేహాన్ని గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉప్పునుంతల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన నవదీప్ సోమవారం పొలం నుంచి ఇంటికి వస్తుండగా, బాలనారి అనే వ్యక్తి జప్తిసదగోడు వైపు వెళ్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో నవదీప్ తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. బాలనారికి స్వల్ప గాయాలయ్యాయి.

నా ప్రాణానికి రక్షణ కల్పించాలి

» అయిజ ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

» డీఎస్పీ మొగులయ్యకు ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితుడు నరేంద్ర

గద్వాల క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తన ప్రాణానికి రక్షణ కల్పించాలని, తనను బెదిరిస్తున్న ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన నరేంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై సోమవారం ఆయన డీఎస్పీ మొగులయ్యకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజలోని ఏజీజీకే ట్రేడర్స్ నిర్వాహకుడు గజేంద్రగౌడు తన ఆధీనంలో ఉన్న కోట్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన సర్వే నెంబర్ 757/ఎ/2లోని 3.33 ఎకరాల పొ లాన్ని నరేంద్ర మధ్యవర్తిగా ఉండి పట్టణానికి చెందిన లక్ష్మి పేరు మీద రిజి స్ట్రేషన్ చేయించాడు. వచ్చిన రూ. 60 లక్షలను గజేంద్రగౌడ్‌కు అప్పుగా ఇచ్చాడు. ఆరు నెలల తర్వాత తాను చెప్పిన వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్మితో ఒప్పందం చేసుకున్నారు. ఆరు నెలల తర్వాత రూ.18 లక్షలను లక్ష్మికి చెల్లించారు. మిగితా డబ్బును తర్వాత చెల్లిస్తామని, తాము రిజిస్ట్రేషన్ చేసిన భూమిని తమకు చెందిన వారిపేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. మొత్తం డబ్బు ఇస్తేనే తాను రిజిస్ట్రేషన్ చేస్తానని ఆమె చెప్పింది. దీంతో మధ్యవర్తిగా ఉన్న నరేంద్రపై గజేంద్రగౌడుతో పాటు, ఎస్‌ఐ విజయభాస్కర్ ఒత్తిడి చేశారు. నరేంద్ర ఇంటికి వచ్చి లక్ష్మితో భూమిని రిజిస్ట్రేషన్ చేయించాలంటూ బెదిరించాడు. కేసులు బనాయిస్తామని, ఇంటిని సీజ్ చేస్తామని పది రోజులుగా పదే పదే ఫోన్ చేసి వేధిస్తున్నారు. దీంతో బాధితుడు నరేంద్ర సోమవారం డీఎస్పీని కలిసి సమస్యను వివరించాడు. గజేంద్ర గౌడ్, ఎస్‌ఐ విజయభాస్కర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

రంగనాయక స్వామిని సన్నిధిలో సీఎం సోదరుడు



ఆలయం ఆవరణలో తిరుపతిరెడ్డి, నాయకులు

శ్రీరంగాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాయక స్వామి ఆలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని నేల మాళిగలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో ఉన్న తాంజావూరు చిత్రాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన చిన్నతనంలో ఆలయానికి వచ్చేవారమని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామి వారి దర్శనానికి వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను అర్చకులు, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ సతీశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ ఆపరేటర్‌పై చర్యలు : ఏఈ

మద్దూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : లైన్‌మన్ ప్రమాదానికి గురి కావడానికి బాధ్యుడైన విద్యుత్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోనున్నట్లు ఏఈ బాలరాజు తెలిపారు. వనపర్తి జిల్లా మద్దూరు మండలం కొత్తపల్లి సబ్ స్టేషన్‌లో లైన్‌మన్‌గా పని చేస్తున్న మోహిన్ లోకుర్తి ఆదివారం ఎల్‌సీ తీసుకొని విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా ఆపరేటర్ కృష్ణారెడ్డి నిర్లక్ష్యంగా విద్యుత్ సరఫరాను ప్రారంభించాడు. ఈ విషయాన్ని గమనించిన లైన్‌మన్ మోహిన్ స్తంభాన్ని రెండు కాళ్లతో బిగించి పట్టుకొని తల కిందులుగా వేలాడి ప్రాణాలను కాపాడుకున్నాడు. ఈ సంఘటనపై ఏఈ బాలరాజు స్పందించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆపరేటర్‌ను బదిలీ చేయడంతో పాటు, శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఇంటర్వ్యూ

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- సురేష్ గౌడ్, ఎస్ఐ



ఖిల్లాఘణపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఖిల్లాఘణపురం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

నూతన చట్టాలపై ఎలా ముందుకు వెళ్తున్నారు?

గత ఏడాది జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయి. కఠినతరంగా మారిన చట్టాలపై ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

కొత్త చట్టాలతో ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందా?

కొత్త చట్టాలతో కేసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతుంది. బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది.

కొత్త చట్టాలు ఏ పేర్లతో పిలుస్తున్నారు?

కొత్త చట్టాలను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియమ్ లాంటి పేర్లతో కొత్త చట్టాలు ఉన్నాయి. చట్టాలపై మహిళలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. చిన్న ఘటన జరిగినా.. వెంటనే స్పందిస్తున్నాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. రాత్రి వేళల్లో సైతం పెట్రోలింగ్ పెంచి నిఘా ఏర్పాటు చేస్తున్నాం.

చోరీలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

చోరీల నివారణకు రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ఈ మధ్యకాలంలో జరిగిన చోరీ కేసుల్లో నిందితులను పట్టుకొని రికవరీ చేశాం. డీజిల్ దొంగతనాలు వాహనాల బ్యాటరీల దొంగతనాలను చేసిన వారిని సైతం గుర్తించాం. తప్పు చేసిన వ్యక్తులకు శిక్షలు పడేలా కేసులు నమోదు చేశాం.

సైబర్ నేరాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలు అత్యాశ పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దు.

అవార్డులు రుణాలు ఇప్పిస్తామని చెప్పే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా అనవసరమైన ఫోన్ కాల్ చేసి ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి.

న్యూస్ బాక్స్

ముఖ్యమంత్రి సోదరుడికి సన్మానం

వనపర్తి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి కుటుంబ సమ్మేతంగా సోమవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని రంగనాయక స్వామిని దర్శించుకున్నారు. వారితో పాటు అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిరెడ్డిని శాలువాతో సన్మానించారు. చిన్నతనంలో ప్రతీ ఏటా సంక్రాంతికి రంగనాయక స్వామిని దర్శించుకునే వారమని, ఈ సారి కూడా ఎవరికి చెప్పకుండా కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నట్లు తిరుపతిరెడ్డి తెలిపారని సతీష్ యాదవ్ తెలియజేశారు.

అంబులెన్స్‌లో మహిళకు ప్రసవం

ఖిల్లాఘణపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఖిల్లాఘణపురం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే శివారు ప్రాంతంలో సోమవారం అంబులెన్స్‌లో మండల కేంద్రానికి మహిళ కృష్ణవేణికి సుఖ ప్రసవం జరిగి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండల కేంద్రానికి చెందిన కృష్ణవేణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా.. 108 వాహనంలో అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో సుఖ ప్రసవం జరిగి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెను తిరిగి పీహెచ్‌సీలో చేర్పించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, అంబులెన్స్‌లో డెలివరీ చేసిన ఈఎంటీ బిందు, పైలెట్ యోగేశ్వర్ తెలిపారు.

కుక్కల దాడిలో మొసలి మృతి

చిన్నంబావి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మొసలి చనిపోయింది. మండలంలోని గూడెం గ్రామ సమీపం లోని జూరాల కాలువ వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఓ గొర్రెల కాపరి జూరాల కాలువ సమీపంలోని గొర్రెల మంద వద్దకు వస్తుండగా మొసలిపై కుక్కలు దాడి చేయడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని స్థానికులకు తెలపడంతో అక్కడికి చేరుకొని మొసలిని బంధించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే అది మృతిచెందిందని తెలిపారు.



మృతిచెందిన మొసలి

వైద్యుల కోసం ఎదురుచూపు

- ట్రామా కోసం ఆసుపత్రి ఏర్పాటు
- స్టాఫ్ నర్సుతో కొనసాగుతున్న వైనం



అత్యవసరాల కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రి

పెద్దమందడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై కొనసాగుతున్న రోడ్డు ప్రమాదం దృష్టిలో పెట్టుకొని గాయపడిన క్షతగాత్రులకు తక్షణ చికిత్స నిమిత్తం (ట్రామా) ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి 44కు పక్కన ఉండటంతో వెల్టూరులో మరొక ప్రాథమిక ఆరోగ్య కంద్రంతో పాటు ట్రామా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో నిర్మాణ పనులను 2019లో ప్రారంభించి 2021లో పూర్తి చేశారు. పూర్తి స్థాయి సిబ్బంది లేకుండానే ఆసుపత్రి కొనసాగుతుంది. గర్భిణులు, బాలింతలు, ఇతర రోగులు సరైన వైద్యులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం పూర్తి స్థాయిలోకి వినియోగంలోకి రాకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. జాతీయ రహదారి పక్కన ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర చికిత్స నిమిత్తం ట్రామా ఆసుపత్రి రహదారి పక్కన ఉండాలనే ఉద్దేశంతో నిర్మించారు. కానీ ట్రామా ఆసుపత్రికి కావాల్సిన వైద్యులు, సిబ్బంది పరికరాలు ఏర్పాటు చేయలేదు. కానీ తాత్కాలికంగా ఒక స్టాఫ్ నర్సు, ఒక నర్సు, ఆశ కార్యకర్తతో నడిపిస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అధునాతన పరికరాలతో పాటు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. నిత్యం 25 నుంచి 30 మంది వరకు అవుట్ పేషెంట్లు వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. ఆదివారం(సెలవు రోజుల్లో) వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రిని మూసివేస్తున్నారు. పూర్తి స్థాయిలో వైద్యులను నియమించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త వైద్యుడిని నియమించే అవకాశం ఉంది...

ఈ నెల 4న కొత్త వైద్యుల నియామకంలో భాగంగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తయింది. ఈ వారంలో కొత్త వైద్యులను నియమించే అవకాశం ఉంది. ట్రామా ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు కూడా వచ్చాయి.

- మంజుల, వైద్యాధికారి

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మామిడిమాడ ఆలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఖిల్లాఘణపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బెస్తగేరి ఆంజనేయ స్వామి ఆలయంలో, గంగమ్మ అమ్మ వారి ఆలయంలో, మామిడిమాడ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సంక్రాంతి భోగి పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే మేఘారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే మేఘారెడ్డికి జ్ఞాపికను అందజేశారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో వీరాంజనేయ స్వామి మాలధారణ, స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఖిల్లాగుట్టపై వెలిసిన వీరాంజనేయ స్వామి ఆలయం వరకు వచ్చే ఏడాదిలోగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. సాయిచరణ్, వెంకటేశ్వర రావు, రమేష్, రాజు, శ్యాంసుందర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం పటిష్ట పరిచేందుకు..

వనపర్తి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం ఇరిగేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్రస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు ప్రభుత్వపరంగా అందించే వైద్యం మెరుగ్గా అందించేందుకు తగిన చర్యలు చేపట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పద్మ భూషణ్ డాక్టర్ ప్రసాద్ రావు సారథ్యంలో జన విజ్ఞాన వేదిక సంస్థ సోమవారం వనపర్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రమాదేవి, నరేందర్, నారాయణ, జితేందర్ పాల్గొన్నారు.

20 నుంచి 30 వరకు మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంపు

వనపర్తి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఓల్డ్ మల్లేపల్లిలోని సీతారం బాగ్ డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ ఆసుపత్రిలో ఈ నెల 20 నుంచి 30 వరకు పరావస్తు క్రియేటివ్ ఆఫ్ పోలీస్ మధుకర్ స్వామి సారథ్యంలో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంపు నిర్వహించనున్నట్లు సోమవారం పరావస్తు క్రియేటివ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మొర్రి, కాలిన గాయాలతో అవయవాలు వంకరలు, చేతివేళ్లు వంకరలు, జన్యుపర లోపంతో శరీరంపై విపరీతమైన వెంట్రుకలు పెరగడం వంటి సమస్యల నివారణకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, గ్రీన్ ల్యాండ్స్ ఆఫ్ లైన్స్ క్లబ్, సేవా భారతి, మెర్సీ, మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 17, 18 తేదీల్లో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి, జనవరి 20 నుంచి 30వ తేదీ వరకు ఉచితంగా సర్జరీలు చేస్తారని అన్నారు. క్యాంపు కోసం పేర్లను పరావస్తు క్రియేటివ్ కోఆర్డినేటర్‌తో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఉచిత ప్లాస్టిక్ సర్జరీ క్యాంపులో అమెరికాకు చెందిన వైద్యులతో సర్జరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 95424 33427 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బండారు సునీతకు సాహితీ పురస్కార అవార్డు

ఆత్మకూరు/ అమరచింత, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అమరచింత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రముఖ కవయిత్రి బండారు సునీతకు సాహితీ పురస్కారం లభించినట్లు రచయిత డాక్టర్ రఘువీర్ ప్రతాప్ తెలిపారు. హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన సాహితీ పురస్కార వారోత్సవాల్లో ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు.

దుస్తుల పంపిణీ

ఆత్మకూరు/ అమరచింత, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ క్రీడను ప్రోత్సహిస్తు అమరచింత గ్రౌండ్ కబడ్డీ క్రీడాకారులకు అమరచింత కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమరచింత పట్టణ కేంద్రంలోని క్రీడాకారులు కబడ్డీ క్రీడల్లో మంచి నైపుణ్యతను సాధిస్తున్నారని తెలిపారు. క్రీడా నైపుణ్యతను పెంపొందించుకొని భవిష్యత్ కాలంలో రాష్ట్రస్థాయికి ఎదగాలని ఆయన తెలిపారు. విష్ణు, ప్రకాశం, కుమార్, జిలాని క్రీడాకారులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ఆరుద్ర నక్షత్ర పూజలు



పరమేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివాలయాల్లో శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా భక్తిశ్రద్ధలతో సోమవారం పూజలు కొనసాగాయి. పట్టణంలోని భవాని శంకర, పాత శివాలయం, భక్త మార్కండేయస్వామి దేవాలయాలతో పాటు కానాయపల్లి, పామాపురం గ్రామాల్లోని కోటిలింగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోని శివలింగాలకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు శేఖరయ్య అన్నదానం చేశారు.

మార్మోగిన సుందరగిరి గుట్టలు

మండలంలోని అప్పరాల గ్రామ శివారులోని సుందరగిరి (పరమేశ్వరుని) గుట్టలు శివనామ స్మరణతో మార్మోగాయి. జనవరిలో వచ్చే పౌర్ణమి సందర్భంగా పరమేశ్వరుని ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. రామకృష్ణాపూర్ గ్రామం నుంచి ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలను తీసుక రాగా సోమవారం ఆలయంలో కొలువయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కొందరు శివ భక్తులు మాలలు ధరించారు. మరికొందరు ఆలయంలో కొలువైన పరమేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో అర్థరాత్రి కొనసాగే నందికోళ్ల సేవ, అగ్నిగుండం శివభక్తుల ప్రవేశం తిలకించడానికి అప్పరాల, రామకృష్ణాపూర్ గ్రామాల ప్రజలతో పాటు కొత్తకోట, వనపర్తి, పెబ్బేరు, ఆత్మకూర్, అమరచింత, మండలాలకు చెందిన పలు గ్రామాల భక్తులు సుందరగిరి గుట్టలకు చేరుకున్నారు.

ఘనంగా భోగి



కొత్తకోటలో...

ఆత్మకూరు/ పెబ్బేరు / శ్రీరంగాపురం/ కొత్తకోట/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగ ఉత్సవాలను సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు కల్లాపి చల్లి ముగ్గులు వేసి రంగులు అద్దారు. కర్రలను పేర్చి భోగి మంటలు వేసి చలికాచుకున్నారు. జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో జంగిడిపురం అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి వాకిటి శ్రీధర్ ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సమాజంలో ఉన్న రుగ్మతలు, ఈర్షద్వేషాలు, తొలగిన నూతన ఉత్సాహం నిండాలని, ప్రజలంతా అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అఖిల పక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ కార్యక్రమానికి హాజరై పట్టణ ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. యువకులు, చిన్నారులు గాలిపటాలను ఎగుర వేస్తూ ఆనందంగా గడిపారు.

- ఆయా గ్రామాల్లో క్రీడా పోటీలు సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ కావడంతో మొదటి రోజు భోగి పండుగ నిర్వహించారు.

ఇళ్ల ముంగిట హరివిల్లులు

పెబ్బేరు/ ఖిల్లాఘణపురం : మండలంలోని గ్రామాలతో పాటు మండల కేంద్రంలో సంక్రాంతి భోగి పండగను పురస్కరించుకుని సోమవారం ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులతో హరివిల్లులు వెల్లివిరిశాయి. మహిళలు చిన్నారులు సంక్రాంతి ముగ్గులు వేయడానికి ఆసక్తిని కనబరిచారు. భోగి పండుగ సందర్భంగా ఇంటి ముందు చిన్నా రులకు భోగి పండ్లు, పూలు పోసి మంగళ హారతులు ఇస్తూ.. కుటుంబ సభ్యులు సంబర పడ్డారు. ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. యువకులు, చిన్నారులు గాలి పటాలు ఎగురవేస్తూ.. పతంగుల పండుగగా సంక్రాంతిని జరుపుకున్నారు. పండుగకు బంధుమిత్రులు ఇంటికి చేరుకోవడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

పెబ్బేరు : మునిసిపల్ పరిధిలోని శ్రీ భక్తాంజనేయ దేవాలయం నందు యూత్ కాంగ్రెస్ కాలనీ యువకులు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు వనపర్తి అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిరెడ్డి తెలిపారు.



శ్రీరంగాపురంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పెబ్బేరు ముగ్గుల పోటీల్లో బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



ఖిల్లాఘణపురంలో భోగి పళ్ల పోసుకున్న చిన్నారి

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దమందడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం వస్తుందని సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో పవన్ స్మారక మండల స్థాయి క్రికెట్ టోర్నీని సోమవారం మాజీ సర్పంచ్ వెంకటస్వామితో కలిసి ప్రారంభించారు. వెంకటస్వామి, రాధాకృష్ణ, రవి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, విజయ్, సేనాపతి పాల్గొన్నారు.

వీపనగండ్ల : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఎస్ఐ రాణి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో డీవైఎఫ్ఐ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆమెతో పాటు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, ఆది, మహేష్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సంగినేనిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విలేజీ ప్రీమియం లీగ్ 4 క్రికెట్ పోటీలను మాజీ సర్పంచ్ మౌలాలి ప్రారంభించారు.



వీపనగండ్లలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రాణి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



రాజశేఖర్ గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్‌తో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు గోపినాథ్ యాదవ్‌లను పార్టీ నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న వయసులోనే రాజశేఖర్ గౌడ్ పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం మరింత బాధ్యతలను పెంచుతుందని అన్నారు. రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో మునిసిపాలిటీలో బీజేపీ జెండా ఎగిరే విధంగా 33 వార్డుల్లో కమిటీలను వేయాలని సూచించారు. అధికార పార్టీ కాంగ్రెస్‌కు దీటుగా పని చేయాలని అప్పుడే ఎన్నికల్లో గెలుస్తామని తెలిపారు. శ్రీశైలం, నాయకులు పెద్దిరాజు, సూగూరు రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవీ కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న సింగిరెడ్డి వాసంతి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని విఠలేశ్వర పాండురంగ స్వామి దేవాలయంలో సోమవారం గోదాదేవీ కల్యాణోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, బండారు కృష్ణ, కాగితాల లక్ష్మీనారాయణ, డ్యానియల్, పాపిశెట్టి శ్రీనివాసులు, పాండు శెట్టి, జగదీష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథంకు నివాళి



కొత్తకోటలో మంద జగన్నాథం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కొత్తకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ, అంబేడ్కర్ సంఘం నాయకులు మాజీ ఎంపీ మంద జగన్నాథంకు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. జగన్నాథం చిత్రపటానికి పూలమాలలు వేశారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, జడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయోజ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జేసీబీరాము, ఇజ్రాయిల్, భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన రావుల

వనపర్తి అర్బన్ : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథంకు మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి నివాళి అర్పించారు. సోమవారం హైదరాబాద్‌లోని చంపాపేట్‌లో వారి నివాసంలో ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి సోదరుడు మంద వెంకట్ కుమార్, కుమారుడు మంద శ్రీనాథ్‌ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

వనపర్తి అర్బన్ : జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ గౌడ్, అశోక్, నాగన్న యాదవ్, గులాం ఖాదర్, రాము పాల్గొన్నారు.

పెబ్బేరు : బీఆర్ఎస్ మండల నాయకులు రాములు యాదవ్, దిలీప్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రె స్వామి, మేకల ఎల్లయ్య, గోపి బాబు, తదితరులు నివాళి అర్పించారు.

వనపర్తి రూరల్ : మంద జగన్నాథం మృతదేహానికి సోమవారం బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



నివాళి అర్పిస్తున్న రావుల చంద్రశేఖర్ రెడ్డి



నివాళి అర్పిస్తున్న భరత్, పురుషోత్తంరెడ్డి

నేటి నుంచి చింతల ఆంజనేయస్వామి ఉత్సవాలు



ఆంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్

పెబ్బేరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పాతపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయి. ఈ దేవాలయంలో ఎక్కడా లేనివిధంగా ఉత్సవాలను నిర్వహిస్తారు. చింతకుంట ఆంజనేయ స్వామికి మాంసం, కల్లుతో నైవేద్యం సమర్పిస్తారు. ఏకంగా స్వామివారి ఆలయం ఎదుట పొటేళ్లు, కోళ్లను బలిస్తారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగ నుంచి మూడు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ ఉత్సవాలకు స్థానిక గ్రామాల ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 16వ తేదీ వరకు కొనసాగుతాయి. ఇక్కడ వెలిసిన స్వామివారు.. అపారశక్తి ఉందని.. కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల నమ్మకం. ఈ ప్రాంతంలో చింతచెట్ల అడివి ఉండి రాక్షసులు సంచరించేవారని, అక్కడకు మనుషులు, జంతువులు వెళ్లినా చంపేవారని ఆ భయంతో ప్రజలు ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించారు. ఇక్కడి ప్రజలను కాపాడాలని రాక్షసులకు జంతువులను బలి ఇస్తామని చెప్పడంతో అప్పటి నుంచి ఆంజనేయస్వామి ఎదుట పొటేళ్లను, కోళ్లను బలిస్తున్నారు. శ్రీరంగాపురం మొదటి పరిపాలన రాజు వాసుదేవరావు తాను కోరుకున్న కోరిక నెరవేరడంతో ఆలయాన్ని నిర్మించారు.